ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -45 పేజీలు - 8 వెల - 03/- గురువారం 4 జూన్ 2026

## 21 మంది మృతి



# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

**40 మందికి గాయాలు మృతుల్లో అత్యధికులు విదేశీయులే**

**సహాయక చర్యల్లో జాప్యంతో భారీ ప్రాణనష్టం**

**భద్రతా ప్రమాణాలు పాటించని భవన యాజమాన్యం - రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**



**న్యూఢిల్లీ :జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

దేశ రాజధానిలో బుధవారం ఉదయం ఒక హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విషాద ఘటనలో 21 మంది నిండు ప్రాణాలు బుగ్గి అయ్యాయి. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. సాకేత్‌లోని మాక్స్ ఆస్పత్రికి 39 మంది తరలించగా..అప్పటికే వారిలో 18 మంది చనిపోయారు. మిగిలినవారికి చికిత్స అందిస్తున్నామని,**మిగతా 2లో...**



## డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

**ఉచిత న్యాయ సహాయం, కోర్టు ఖర్చుల బాధ్యత వైసీపీదే..**

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశామన్న జగన్**

**వైసీపీ అధికారంలోకి రాగానే అక్రమాలపై రీ-ఎంక్వైరీ చేయిస్తామని వెల్లడి**

**క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని విమర్శ**

**జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

డీఎస్సీ పరీక్షల్లో తీవ్ర అన్యాయం జరిగిందంటూ ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు తమ మద్దతు ఉంటుందని వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. బాధితుల పక్షాన నిలిచి వారికి అవసరమైన ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని, కోర్టు ఖర్చులన్నింటినీ తమ పార్టీయే భరిస్తుందని ఆయన **మిగతా 2లో...**

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

**సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు**

**యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు**

**21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు**

**సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి**

**గుంటూరు,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ **మిగతా 2లో...**



## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

**ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్**


**మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం**

**సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు**

**కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి**

**బెంగళూరు,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక పముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు.
**మిగతా 2లో...**



## ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

**సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ**




# కులదూషణలు దారుణం

**అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం**

**ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన**

**అమరావతి,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు. కొంతమంది స్వార్థపరులు**మిగతా 2లో...**



## భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారుచేయించారని అమెరికా ఆరోపణ**

**అందుకుగానూ 12.5 శాతం పన్ను విధించాలని ప్రతిపాదన**

**ఇది ఇంకా ఖరారు కాలేదని కేంద్రం ప్రభుత్వం వివరణ**

**వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు సాగుతున్నట్లు వెల్లడి**



## టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

**తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం**

**యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర



ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు **మిగతా 2లో...**



## పెట్టుబడుల వేట

**రష్యా పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ**

**కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు**

**రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు**

**మాస్కో,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు.**మిగతా 2లో...**

# ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం



**మొదటిపేజీ తరువాయి**

వీరిలో 8 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటిలేటర్ పై చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంలో జాప్యం చోటుచేసుకోవడం వల్లే భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగిందన్న విమర్శలు వస్తున్నాయి. బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ కు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని కాంగ్రెస్, ఆమాద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధితుల్లో అత్యధికులు మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారు. ఈ విషాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనకు సంబంధించి హోటల్ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో ఉదయం 8.50గంటల సమయంలో ఫ్లరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఉదయం ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయడానికి ప్రయత్నించగానే మంటలు వచ్చాయని చెఫ్ కేసర్ సింగ్ తెలిపారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశానని, బయటకు వచ్చి చూసేసరికి ఒక్కసారిగా మంటలు హోటల్ అంతా వ్యాపించినట్లు కనిపించిందని తెలిపారు. మంటలు చెలరేగిన సమయంలో సీల్డ్ గాజు కిటికీలు, సెన్సార్‌తో పనిచేసే గేట్ల వల్ల సహాయక సిబ్బంది వెంటనే చర్యలు తీసుకోవడం కూడా ఇబ్బందిగా మారింది. దీనికి తోడు హోటల్‌లో పరిమితికి మించి జనాభా వున్నట్లు తెలుస్తోంది. కిక్కిరిసిన రూములు, పైగా అగ్ని ప్రమాదం జరిగినపుడు తీసుకోవాల్సిన భద్రతా ప్రమాణాలు కూడా హోటల్ యాజమాన్యం ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఈ భవనానికి లేదు. దీంతో మొత్తంగా హోటల్ ఒక మృత్యుకూపంగా మారింది. చాలా వేగంగా భవనాన్ని పొగ, మంటలు కమ్ముకోవడంతో డజన్ల సంఖ్యలో లోపలివారు తప్పించుకునే వీలు లేకపోయింది.

సమాచారం తెలిసిన వెంటనే స్థానికులు కిటికీలు బద్దలు కొట్టి, దుప్పట్లు కప్పి లోపల వున్నవారు బయటకు వచ్చేందుకు సాయపడ్డారు. ఐదంతస్తుల ఈ హోటల్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద నడుస్తోంది. ఆ లైసెన్స్ ప్రకారం ఆరు గదులకు మాత్రమే అనుమతి వుంటుంది. కానీ భవనం బేస్‌మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్, పైన గల ఐదు అంతస్తుల్లో ఏకంగా 25 గదులు వున్నట్లు తెలుస్తోందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. పైన టెర్రస్ కూడా వుందని, అన్ని అంతస్తుల్లోనూ గదులు వున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే బయటపడేందుకు కూడా వీల్లేని రీతిలో అత్యంత అధ్వాన్నంగా ఆ నిర్మాణం వుందని చెప్పారు. అయితే వెంటనే అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలికి రావడంలో ఆలస్యమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆ హోటల్ భవనానికి ఎదురు భవనంలో వుండే అంజుమ్ అనే మహిళ మాట్లాడుతూ పొద్దునే తన తండ్రికి మందులు ఇవ్వడానికి ఆయన గదిలోకి వెళ్ళేసరికి ఏదో వాసన వచ్చిందని, ఆ వెంటనే ఒక స్పార్క్‌లా వచ్చిందని, భవనం మంటల్లో చిక్కుకుందని తెలిపారు. పెద్ద ఎత్తున పేలుళ్ళ శబ్దాలు కూడా వినిపించాయన్నారు. చాలామంది ప్రాణాలు కాపాడుకోవడానికి పైఅంతస్తుల నుండి కిందకు దూకేశారని తెలిపారు. వీరిలో మహిళలు కూడా వున్నారన్నారు. మృతదేహాలు గుర్తుపట్టడానికి వీల్లేకుండా వున్నాయి. ప్రతి ఒక్కరూ తీవ్రంగా కాలిపోయారని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఢిల్లీ పోలీసులు కల్పబుల్‌హోమిసైడ్ అభియోగాల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ భవనం ఎన్నేళ్ళ కాలం నాటిది, యజమాని ఎవరు అన్న వివరాలు కనుగొని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ స్థాయీ సంఘం చైర్మన్ సత్య శర్మ తెలిపారు.

# త్వరలో డిజిటల్ హెల్త్ రికార్డులు

**మొదటిపేజీ తరువాయి**

ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు. 32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు.

ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

**మొదటిపేజీ తరువాయి**

చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత–జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷–లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు.జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మి హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కులదూషణలు దారుణం

**మొదటిపేజీ తరువాయి**

ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం

వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# డీఎస్సీ అభ్యర్థులకు జగన్ భరోసా

**మొదటిపేజీ తరువాయి**

హామీ ఇచ్చారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని గుర్తుచేసిన ఆయన.. భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అక్రమాలపై రీ–ఎంక్వైరీ చేయించడంతో పాటు, కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక కమిషన్ కూడా వేయిస్తామని స్పష్టం చేశారు.

క్రీడా కోటా ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని జగన్ తీవ్రంగా విమర్శించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తామంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, చంద్రబాబు తనకు కావలసిన వారికి లబ్ధి చేకూర్చడానికే ఈ గేట్లు తెరిచారని ఆరోపించారు. అనుకున్న వారికి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి కాగానే, మళ్లీ పాత జీవోను మార్చేసి కొత్త జీవోను తీసుకురావడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో పాలకుల స్వార్థం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు.ప్రస్తుత డీఎస్సీ నిర్వహణలో లీకేజీల దగ్గర నుంచి అనేక అవకతవకలు బయటపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదనే నెపంతో ఫస్ట్ ర్యాంకర్లను పక్కన పెట్టారని ప్రభుత్వం చెబుతుంటే.. మరి అదే అభ్యర్థులు న్యాయం కోసం కోర్టులను ఎందుకు ఆశ్రయిస్తున్నారని ప్రశ్నించారు. అభ్యర్థుల ఫిర్యాదులకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు కరవయ్యాయని, అధికారుల తీరులో తీవ్ర లెక్కలేనితనం కనిపిస్తోందని జగన్ దుయ్యబట్టారు.

# భారత్‌పై అమెరికా మళ్లీ టారిఫ్స్..

**జూన్ 03 రిపబ్లిక్ న్యూస్** భారత వస్తువులపై అమెరికా మరోసారి అదనపు సుంకాలు విధించనుందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై అగ్రరాజ్యంతో నిరంతరం చర్చిస్తున్నామని, ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది. కార్మికులతో వెట్టిచాకిరి చేయించి ఉత్పత్తులు తయారు చేయించారంటూ భారత్‌తో సహా 60 దేశాలపై సెక్షన్ 301 కింద అదనపు సుంకాలు విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించిన విషయం తెలిసిందే.

దీనిపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పందిస్తూ అమెరికాతో వాణిజ్య ఫ్రేమ్‌వర్క్ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు చర్చలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఈ పన్నుల ప్రతిపాదన ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ దశలోనే ఉందని పేర్కొంది. సంబంధిత వర్గాలు 2026 జూన్ 22లోపు తమ విజ్ఞప్తులను సమర్పించవచ్చని, జులై 7 తర్వాతే అమెరికా తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

ఇప్పటికే సెక్షన్ 232 కింద ఉన్న కొన్ని ఉత్పత్తులకు ఈ కొత్త పన్నుల నుంచి మినహాయింపు లభించింది. అలాగే టెక్స్‌టైల్ రంగానికి అమెరికా ప్రత్యేక వెసులుబాటును ప్రతిపాదించింది. దీని ప్రకారం నిర్దేశిత పరిమాణంలోని దుస్తుల దిగుమతులపై తక్కువ పన్ను రేట్లు విధించే అవకాశం ఉంది. పరస్పర వాణిజ్య ఒప్పందాలు అంగీకరించే దేశాలకు ఈ పన్ను 10 శాతంగా ఉంటుంది. ప్రస్తుతానికి చర్చలు నడుస్తున్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత్ వెల్లడించింది.

# పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ–కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷–లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో

అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷–లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్టర్న్ ఎ÷–లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూన్గి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ–ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్గి÷డ్, పీర్–టు–పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి–రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్–రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# అభివృద్ధి దిశగా ఏడీసీసీబీ అడుగులు

**చైర్మన్ కేశవరెడ్డి పదవీ బాధ్యతలకు ఏడాది పూర్తి -ప్రధాన కార్యాలయంలో ఘనంగా వేడుకలు -రైతు సంక్షేమం, పారదర్శక సేవలే లక్ష్యం : చైర్మన్**





**అనంతపురం ప్రతినిధి, జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్):**
అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఏడిసిసిబి) చైర్మన్‌గా ఎం. కేశవరెడ్డి బాధ్యతలు చేపట్టి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రత్యేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉన్నతాధికారులు, సహకార రంగ ప్రముఖులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.

**బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యం**

ఈ సందర్భంగా చైర్మన్ ఎం. కేశవరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో పాలకమండలి, అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయడంతో బ్యాంకు పురోగతి దిశగా ముందుకు సాగిందని పేర్కొన్నారు. రైతులు, ఖాతాదారుల అవసరాలను కేంద్రబిందువుగా తీసుకుని సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేశామని తెలిపారు. సహకార బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని, రైతులకు సకాలంలో రుణాలు, ఆర్థిక సేవలు అందించడంలో బ్యాంకు కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. భవిష్యత్తులో కూడా పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజా సేవా దృక్పథంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సీఈఓ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు చైర్మన్ కేశవరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ నాయకత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించింది

**: జ్వాలాపురం శ్రీకాంత్**

**దేవాలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు**

**జగన్ హయాంలో ఆలయాల పునర్నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామని వ్యాఖ్య**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 3)**
కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు బ్రాహ్మణ సమాజానికి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎండోమెంట్స్ అడ్వైజర్ జ్వాలాపురం శ్రీకాంత్ ఆరోపించారు. కర్నూలులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం, అర్చకుల అభివృద్ధి, దేవాలయాల పరిరక్షణ పేరుతో ప్రజలను నమ్మించి ఇప్పుడు వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.
రాష్ట్రంలో దేవాలయాల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని, ఆలయాలను కూడా కుల రాజకీయాలకు వేదికగా మార్చారని ఆయన ఆరోపించారు. హిందూ ధర్మ పరిరక్షణ పేరుతో పెద్దఎత్తున హామీలు ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని అన్నారు.
మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి పాలనలో ప్రతి నియోజకవర్గంలో పాత దేవాలయాల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పాటు హిందూ ధర్మ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినట్లు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అర్చకుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు అమలు చేసిన ప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వమేనని తెలిపారు.
వచ్చే ఎన్నికల్లో కూడా బ్రాహ్మణులను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించిన ఆయన, ప్రజలు వాస్తవాలను గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో మంకాల కృష్ణకాంత్, రాజశేఖర్, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# విద్యా సేవలకు చిరస్మరణీయ ముద్ర

**మహిళలకు అనురాధ మేడం స్ఫూర్తిదాయకం**

**మూడున్నర దశాబ్దాల సేవా ప్రస్థానానికి ఘన వీడ్కోలు**

**ఉపాధ్యాయ వృత్తిని సేవా యజ్ఞంగా మలిచిన ఆదర్శ విద్యావేత్త**



**అనంతపురం ప్రతినిధి, జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్ ):**
విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణాన్ని జీవిత ధ్యేయంగా భావించి, ఉపాధ్యాయ వృత్తిని సేవా యజ్ఞంగా మలిచిన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు కే. అనురాధ మేడం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి పేర్కొన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీ సర్వేపల్లి నగరపాలక మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించిన అనురాధ మేడం ఇటీవల పదవీ విరమణ పొందిన సందర్భంగా నగరంలోని దేవాంగ భవన్‌లో బుధవారం ఘన సన్మాన సభ నిర్వహించారు. ఎస్టీయూ నాయకులు పనిభూషణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

**వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యతలపై అవగాహన**

ఈ సందర్భంగా డాక్టర్ నిర్మలమురళి మాట్లాడుతూ అనురాధ మేడం సేవలు విద్యారంగానికే కాకుండా సామాజిక సేవా రంగానికీ ఎంతో విలువైనవని అన్నారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించిన నాటి నుంచి గత తొమ్మిదేళ్లుగా సంస్థ కార్యక్రమాలకు ఆమె అందించిన సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు వ్యక్తిత్వ వికాసం, విలువల పెంపు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడంలో అనురాధ మేడం ఎల్లప్పుడూ ముందుండేవారని గుర్తుచేశారు. సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును విద్యార్థులకు అలవర్చడం ఆమె ప్రత్యేకతగా నిలిచిందన్నారు.

**అమ్మలా ఆదరించిన ప్రధానోపాధ్యాయురాలు**

పిల్లల సమస్యలను అర్థం చేసుకుని వారికి తల్లిలా మార్గనిర్దేశం చేయగలిగిన విద్యావేత్తగా అనురాధ మేడం గుర్తింపు పొందారని పలువురు వక్తలు కొనియాడారు. ఆమె పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించగలరనే విషయాన్ని తన జీవన ప్రయాణంతో అనురాధ మేడం నిరూపించారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సామాజిక సంస్థల



ప్రతినిధులు కలిసి అనురాధ మేడం దంపతులను ఘనంగా సన్మానించి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఆమెకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రాజశేఖర్, మురళీకృష్ణ, మల్లికార్జున, విరూపాక్షగౌడ్, జనార్ధన, రాజన్న, ప్రభాకర్, ఆర్కే నాయుడు, ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేసు, నారాయణ నాయక్, టీఎన్‌యూఎస్ నాయకులు నాగభూషణం నాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ-2025 మెరిట్ లిస్టు విడుదల చేయకపోవడం వెనుక కుట్ర ఉందని బీఎస్పీ ఆరోపణ

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం జరిగిందని విమర్శలు**

**డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 3)**
డీఎస్సీ-2025 మెరిట్ లిస్టును ప్రభుత్వం విడుదల చేయకపోవడం వెనుక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులను మోసగించే ఉద్దేశం ఉందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ ఆరోపించారు. కర్నూలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన అన్ని డీఎస్సీ నియామకాల మెరిట్ లిస్టులను ప్రభుత్వాలు బహిరంగంగా ప్రకటించాయని, అయితే డీఎస్సీ-2025కు సంబంధించిన మెరిట్ లిస్టును మాత్రమే విడుదల చేయలేదని విమర్శించారు. డీఎస్సీ-2025లో ఎకనామికల్ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ అమలు కారణంగా తక్కువ మార్కులు సాధించిన ఓసీ అభ్యర్థులకు ఉద్యోగాలు లభించగా, ఎక్కువ మార్కులు సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు నష్టపోయారని ఆయన ఆరోపించారు. ఈ విషయాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే మెరిట్ లిస్టును ప్రభుత్వం విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. తమిళనాడులో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయడం లేదని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం దానిని అమలు చేయడం ద్వారా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రావాల్సిన అవకాశాలు ఇతర వర్గాలకు మళ్లిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈడబ్ల్యూఎస్ అమలుకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు రెండూ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు, అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని బీఎస్పీ డిమాండ్ చేసింది. విచారణలో అక్రమాలు తేలితే తక్కువ మార్కులతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల నియామకాలను రద్దు చేసి, అర్హత మేరకు ఎక్కువ మార్కులు సాధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరింది.
ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఈడబ్ల్యూఎస్ విధానాన్ని కొనసాగిస్తున్నాయని ఆరోపించిన గాడి అరుణ్ కుమార్, సామాజిక న్యాయం కోసం ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం శిక్షణ కార్యక్రమం





**చిప్పగిరి, జూన్, 3, (రిపబ్లిక్ న్యూస్ )** డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద వంట కార్మికులు మరియు సహాయకుల కు ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడింది, ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు శ్రీమతి సావిత్రమ్మ గారు, శ్రీ ఫరూక్ గారు మరియు రిసోర్స్ పర్సన్ శ్రీమతి మల్లమ్మ హాజరై మార్గనిర్దేశనం చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన వంట కార్మికులు మరియు సహాయకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన తయారీలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రతా నియమాలు, పోషక విలువలు కలిగిన వంటకాలను తయారు చేసే విధానాలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా చర్చించారు. అలాగే వివిధ రకాల నమూనా వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. వాటి తయారీ విధానాలను వివరించి, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్సీపీ ఆగ్రహం

## కళ్యాణదుర్గంలో గోడపత్రికలు, బుక్ లెట్ లు ఆవిష్కరణ

**కళ్యాణదుర్గం సంక్షేమం, జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్):**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గడిచిన రెండేళ్లలో ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కళ్యాణదుర్గంలో బుధవారం ప్రత్యేక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.
వైఎస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో " ప్రభుత్వ వైఫల్యాలపై పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరణ " కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య సూచనల మేరకు పార్టీ ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత



వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమిటి, వాటి అమలు పరిస్థితి ఏమిటి, ప్రభుత్వం చేసిన తప్పిదాలు ఏమిటి అనే అంశాలను వివరించేలా పోస్టర్లు, బుక్‌లెట్లు రూపొందించినట్లు తెలిపారు. వీటిని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పంపిణీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, పెరిగిన ధరలు, అభివృద్ధి పనుల నిర్లక్ష్యం వంటి అంశాలపై వైఎస్సార్సీపీ భవిష్యత్తులో మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సోమయాజులు పల్లె లక్ష్మీదేవి హాస్పిటల్ లో ఉంటే గ్రామ పంచాయతీ కార్యదర్శి వెళ్లి పింఛన్

**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 3 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండలంసోమయాజులపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి , ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెలుగు లక్ష్మీదేవి కి స్వయంగా వెళ్లి పెన్షన్ అందజేయడం ద్వారా ప్రజాసేవ పట్ల తన బాధ్యత, నిబద్ధత మరియు సేవా దృక్పథాన్ని చాటిచెప్పారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా, అవసరమైన సమయంలో లబ్ధిదారులకు సేవలను చేరవేయడం పరిపాలనా వ్యవస్థ ప్రజలకు ఎంత చేరువగా ఉండాలో తెలియజేసే అభినందనీయమైన చర్య.విధిని కేవలం పరిపాలనా బాధ్యతగా కాకుండా, మానవతా దృక్పథంతో ప్రజల అవసరాలను గుర్తించి స్పందించడం సమర్థవంతమైన ప్రజా పరిపాలనకు నిదర్శనం. ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని సేవలందిస్తున్న ఆయన సేవలు ప్రశంసనీయమైనవి మరియు ఆదర్శప్రాయమైనవి.సమర్థవంతమైన పరిపాలన అనేది కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా, అవసరమైన సమయంలో ప్రజల వద్దకు చేరుకుని సేవలను అందించడంలోనే ప్రతిఫలిస్తుంది .

# ఏపిడబ్ల్యూజేఎఫ్ రాప్తాడు నియోజకవర్గ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షుడిగా కొండప్ప .. .. ప్రధాన కార్యదర్శిగా గణేష్**

**జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా నాయకుల పిలుపు**



**అనంతపురం / రాప్తాడు జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్ ):**
ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాప్తాడు నియోజకవర్గ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురం నగరంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో నిర్వహించిన జర్నలిస్టుల ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సమావేశానికి ఏపిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు షఫీఉల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరై ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, అభివృద్ధే సంఘం యొక్క ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

**నూతన కార్యవర్గం ఇలా .....**
రాప్తాడు నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బి. వెంకటేశులు, అధ్యక్షుడిగా పి. కొండప్ప (అనంతభూమి), ప్రధాన కార్యదర్శిగా ఆర్. గణేష్ (ఎన్‌టీవీ), కోశాధికారిగా ఆర్. రామకృష్ణ (లేపాక్షి టైమ్స్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఉపాధ్యక్షులుగా నల్లప్ప (బిగ్ టీవీ), దస్తగిరి (మనం), మహేష్ (రాజ్ న్యూస్) ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా మురళీమోహన్ రెడ్డి (సాక్షి), అశోక్ కుమార్ (సాక్షి) బాధ్యతలు చేపట్టనున్నారు.
కమిటీ సభ్యులుగా శివశంకర్ (ఎన్‌టీవీ), షమీ (మహా న్యూస్), వీర్రాజులు (ఆంధ్రప్రభ), వెంకటేశులు (ఐ న్యూస్), ఖాసీం వలి (సాక్షి), ప్రజాపతి (వార్త), భాస్కర్ (వార్త), మురళీకృష్ణ (సూర్య), మురళి (ప్రజాశక్తి) ఎన్నికయ్యారు.

**రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రామకృష్ణ రెడ్డి**
రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రామకృష్ణ రెడ్డి (ప్రజాశక్తి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.నూతనంగా ఎన్నికైన నాయకులు సంఘ బలోపేతానికి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# భూముల కౌలు వేలం.. ఆలయాలకు పెరిగిన ఆదాయం



**బండి ఆత్మకూరు, జూన్ 3, (రిపబ్లిక్ న్యూస్):-**
బండి ఆత్మకూరు మండలం, పెద్ద దేవలాపురం గ్రామంలో వెలసిన శ్రీ వరదరాజ స్వామీ, శ్రీ ఆంజనేయ స్వామి,లింగమయ్య స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూములకు ఆలయ అధికారులు బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. బుధవారం ఆలయ చైర్మన్ యస్. జయదేవ దత్త ఆలయ కార్యనిర్వహణాధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కౌలు వేలాలకు పర్యవేక్షణ అధికారిగా నంద్యాల డివిజన్ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి హాజరయ్యారు. సుమారు 40.36 ఎకరాల మాన్యం భూమినీ రూ 12.95 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే భూమికి రూ 12.83 లక్షలు వచ్చిందని ఈవో తెలిపారు. గత ఏడాది కంటే ప్రస్తుత ఏడాది రూ.11 వేలు ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. అలాగే నారాయణపురం గ్రామంలో నిర్వహించిన ఆలయ భూముల వేలంపాటల్లో 18.82 ఎకరాల మన్యం భూమిని రూ.6.57 లక్షలకు రైతులు ఒక ఏడాది కౌలుకు దక్కించుకున్నారు. అయితే గత ఏడాది ఇదే భూమికి రూ 5.09 లక్షలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ప్రస్తుత ఏడాది రూ 1.48 లక్షల ఆదాయం పెరిగినట్లు ఈవో వివరించారు. ఈ వేలం పాటల్లో ఆయా గ్రామాలకు చెందిన ఆలయ చైర్మన్ లు, పాలకమండలి సభ్యులు ఆలయ సిబ్బంది నాగరాజు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# నేడు పెద్ది సినిమా విడుదల



**మంత్రాలయం, జూన్, 3,(రిపబ్లిక్ న్యూస్ ):** రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన రూలర్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని థియేటర్లలో విడుదల కానుంది.అని తెలిసిందే బుధవారం మంత్రాలయం టౌన్ రామ్ చరణ్ యువ శక్తి యువత పెద్ది సినిమా రిలీజి సందర్భంగా ఓ ప్రవేట్ లాడ్జి నందు , టీ షర్టు టోపీలు, మంత్రాలయం తెలుగుదేశం టౌన్ అధ్యక్షులు వరదరాజులు చేతుల మీదుగా లాంచ్ చేయడం ఈ టీ షర్టు టోపీలు హైదరాబాదు నుండి హీరో రామ్ చరణ్ తన అభిమానులకు స్వయంగా పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ అభిమానులు యువశక్తి రామ్ చరణ్ ఫ్యాన్స్ టౌన్ ప్రెసిడెంట్ వెంకటేష్, శివ, సద్దాం, భరత్, సుధాకర్, సీను, హుసేని, రాజు, జనసేన నాయకులు బీబీసీ చిన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాల మేరకే పరిశీలన.

## తాసిల్దార్ సుమని.







**రైల్వేకోడూరు జూన్ 3 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం అనంతంపల్లి రెవిన్యూ పొలం సర్వేనెంబర్ 1409- ఏడెకరాల 59 సెంట్లు విస్తీర్ణం గల వివాదస్పద ప్రభుత్వ బంజరు భూమిని జిల్లా కలెక్టర్ ఆదేశాలకు బుధవారం పరిశీలించినట్లు మండల తాసిల్దార్ సుమని తెలిపారు, చక్రం పేట ఎగువపల్లె హరిజనవాడకు చెందిన కొందరు నిరుపేద గ్రామస్తులు1409 సర్వే నెంబరు గల ప్రభుత్వ బంజరు భూమిలో గత 30 సంవత్సరాలకు పైబడి గుడిసెలు వేసుకొని వాటి ఆధారంగా గొర్రెలు మేకలు పశువులు మేపుకొని సాగిస్తున్నారు ఈ క్రమంలో అనంతంపల్లి పంచాయతీ రాజుపాలెం గ్రామానికి చెందిన కొందరు అగ్ర కులాల వారు, నిరుపేద దళితులు గుడిసెలు వేసుకొని అనుభవంలో ఉన్న ఆ భూమిపై కన్నేసి వారిని అక్కడనుంచి తరిమి వేసి జెసిబి యంత్రాల సహాయంతో గుడిసెలు తోసేసి ఆ భూమిని అంతటిని చదును చేస్తుంటే అడ్డుపడిన దళితవాడకు చెందిన వ్యక్తులను తరిమి ఇది మా భూమి మీరు వెళ్లిపోండి అనగా ఇదేమీ న్యాయము 30 సంవత్సరాలకు పైబడి మేమిక్కడ నివసిస్తుంటే మమ్మల్ని తరిమేస్తున్నారా అని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చి నివేదికను పంపవలసిందిగా కోరగా బుధవారం తాసిల్దార్ సుమని ఆ భూమిని పరిశీలించారు, ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ 149 సర్వేనెంబర్ ప్రభుత్వ బంజరు భూమిని వంక పరంబోకుని ఈ పొలం నివాసయోగ్యం కాదని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి అనువైన ప్రాంతం కాదని ఈ ప్రాంతం వంక పరంబోకుని కుదరదు అన్నారు ఎగువపల్లె దళితవాడకు చెందిన నిరుపేదలు ఇల్లు లేని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినతి పత్రము సమర్పించుకుంటే ప్రభుత్వ భూమి ఉన్నచోట పరిశీలించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందని తాసిల్దార్ సుమని అన్నారు అటు అగ్రవర్ణాలకు గాని ఇటు దళితులకు గాని ఆ పొలం ఇవ్వలేమని ఎవరు ఆ పొలములోకి వెళ్లడానికి ఆక్రమించుకోవడానికి అర్హత లేదని కాదని ఎవరైనా ఆక్రమించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు, వీఆర్వో కిషోర్ ని సంప్రదించగా 1409 సర్వేనెంబర్ ఆర్ ఎస్ ఆర్ ప్రకారం ఉన్నదని వంక పోరంబోకు గా ఉన్నదని ఇక్కడ పేదలకు ఇల్లు పట్టాలి ఇవ్వడానికి అనుమతి లేదని అన్నారు వారు ఇళ్ల స్థలాల కోసం అర్జీలు పెట్టుకుంటే తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి మరి ఏ ప్రాంతంలో అయినా మంజూరు చేయటానికి జరుగుతుందని అన్నాడు, ఈ విషయమై గ్రామస్తులను సంప్రదించగా గ్రామస్తులు గత 30 సంవత్సరాలకు పైబడి ఇక్కడే మేము నివాసం ఉంటున్నామని ఈ ప్రాంతానికి సుమారు కిలోమీటర్ పైన దూరములో వంక ఉన్నదని ఇక్కడికి నీరు రావడం జరగదని సాధారణంగా వర్షాకాలంలో పారే నీరు తప్ప మరి ఏ విధముగాను ఇక్కడ ప్రమాదకరంగా లేదని అన్నారు అగ్రకులాల వారు అధికారులతో పేదలకు ఈ స్థలం ఇవ్వడం ఇష్టం లేక వారి ద్వారా సాకులు చెప్పిస్తున్నారని మాకు అన్యాయం చేస్తున్నారని జిల్లా కలెక్టర్ గారు స్పందించి నిరుపేదలేన మాకు 149 సర్వేనెంబర్ లో గల భూమిని ఇళ్లపట్టాలకు మంజూరు చేసి భూమిలోని నిరుపేదలకు వ్యవసాయ ఫలాన్ని ముంజలు చేయాలని కోరుతున్నామన్నారు, ఎగువపల్లె దళితుల తరఫున పోరాడుతున్న రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలిమిరెడ్డి మల్లికార్జున, రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ముత్యాల గాజుల శ్రీను, రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి కౌన్సిల్ సభ్యుడు పవన్ తాసిల్దారును కలిసి ఎగువపల్లి దళితులకు సహాయం చేయవలసినదిగా కోరారు ఆ ప్రాంతంలో వారు కొన్ని సంవత్సరాలుగా అనుభవంలో ఉన్నారని అక్కడ వారికి ఇళ్ల పట్టాలు వ్యవసాయ భూములు మంజూరు చేయాలని కోరారు మండల తాసిల్దార్ వారి అభ్యర్థనకు స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సామరస్యంగా పరిష్కరించడం జరుగుతుందని అన్నారు దళిత నాయకులు ఆ ప్రభుత్వ భూమిలో బోర్డు పెట్టించవలసినదిగా ఎమ్మార్వో ను కోరారు ఎగువపల్లె గ్రామస్తులు ఒక ఇంటిలో రెండు మూడు ఫ్యామిలీలు సంసారం అత్యంత దుర్భరంగా సాగుతున్నదని జిల్లా అధికారులు స్పందించి 149 సర్వే నెంబర్లు మాకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని మిగులు భూమి సెంటు వ్యవసాయ పొలం లేని నిరుపేదలకు మంజూరు చేయాలని , 14 09సర్వే నెంబరు మూడు వైపులా దళితుల భూములే ఉన్నాయని కావున ఆ భూమిని కూడా సెంటు వ్యవసాయ భూమి లేని వారికి మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కిషోర్ గ్రామస్తులు పాల్గొన్నారు,

# పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దుకాణాలు సీజ్

**డస్ట్‌బిన్‌లు తప్పనిసరి..- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, ట్రేడ్ లైసెన్స్ రద్దు కూడా: కమిషనర్ చల్లా ఓబులేసు**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 3)**
నగరంలోని వాణిజ్య దుకాణాల యజమానులు తమ దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి దుకాణంలో తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. పరిశుభ్రత నిబంధనలను ఉల్లంఘించి పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచిన దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జరిమానాలు విధించడమే కాకుండా ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేసి, అవసరమైతే దుకాణాలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు.
బుధవారం నగర పరిధిలోని 44వ జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు, సుంకేసుల రోడ్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. జాతీయ రహదారి వెంట పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక వాహనం, అదనపు సిబ్బందిని నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా సంతోష్‌నగర్, బళ్ళారి చౌరస్తా ప్రాంతాల్లోని టీ దుకాణాలను తనిఖీ చేసిన కమిషనర్, అక్కడ డస్ట్‌బిన్‌లు లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, ద్విచక్ర వాహనాలు అస్తవ్యస్తంగా పార్క్ చేయడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జరిమానాలు విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశించారు. ఇదే పరిస్థితి మళ్లీ పునరావృతమైతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాలను సీజ్ చేయాలని హెచ్చరించారు.
కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, కుర్మయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


# భోజనం గ్రామంలో వైభవంగా 21 రోజుల పండుగ


## వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తమైన ప్రత్యేక పూజలు



**బండి ఆత్మకూరు, జూన్ 3, (రిపబ్లిక్ న్యూస్ ):-**
బండి ఆత్మకూరు మండలం, భోజనం గ్రామంలో శ్రీముక్తేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఇటీవల ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి నాగప్రసాద్, కార్యక్రమ కార్య నిర్వాహకులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి, చైర్మన్ సగినేల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం 21 రోజుల పండుగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వెల్లాల యజ్ఞ రామయ్య శర్మ నేతృత్వంలోని వేద పండితులు బుధవారం ఉదయం నుంచి వేదమంత్రాలతో దేవునికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు, అర్చనలు చేసి హోమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవారికి కార్యకర్తలు సమర్పించి వారి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయంలో ప్రాణ ప్రతిష్ట చేసిన స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు ధరింపజేసి వేద పండితులు రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూర్తయిన తర్వాత దైవ శక్తిని పదిలపరుచుకోవడానికి మరియు అదే దైవానికి కృతజ్ఞతగా 16 రోజులపాటు షోడశ దిన పూజలు చేయడం ఆనవాయితీ అని తెలిపారు. కానీ ఇక్కడ 21 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ఇది శాస్త్రోక్తంగా జరిగే ఒక పవిత్రమైన దైవకార్యం అన్నారు. ముగింపు పూజల్లో భాగంగా పూర్ణాహుతి, మహా నివేదన, కుంభాభిషేకం జరిపి ఉత్సవాలను ముగించడం జరిగిందన్నారు. ఆ తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు కార్యనిర్వహకులు అన్న ప్రసాద వితరణ చేశారు







# దళితులు అంటే అంత చిన్న చూపా

**దళితులను అవమానించిన నన్నూరు గ్రామపంచాయతీ మొదటి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ రియాజ్ భాష**

**రియాజ్ భాషను తమ విధుల నుంచి తొలగించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి -ఓర్వకల్లు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మహేంద్ర బాబు మాదిగ**

**ఓర్వకల్ ప్రతినిధి, జూన్ 3 (రిపబ్లిక్ న్యూస్)**
దళితులు అంటే అంత చిన్న చూపాదళితులను అవమానించిన ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామపంచాయతీ మొదటి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ రియాజ్ భాష ను తమ విధుల్లో నుంచి తొలగించి వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. ఎమ్మార్పీఎస్ ఓర్వకల్లు మండల అధ్యక్షులు బొగ్గుల మహేంద్ర బాబు మాదిగ.మంగళవారం ఈనెల రెండో తేదీనా నన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి మొదటి సచివాలయమునకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొగ్గుల మహేంద్ర బాబు తనది తన సతీమణి భవానిది ఆధార్ కార్డులో అడ్రస్ మార్చుకోవాలని నన్నూరు గ్రామపంచాయతీ లోని మొదటి సచివాలయమునకు వెళ్లడం జరిగింది అక్కడ డిజిటల్ అసిస్టెంట్ రియాజ్ భాష గారు ఆధర్



సర్వీస్కు వచ్చిన వారిపై దురుసుగా ప్రవర్తించడం జరిగింది. అప్పుడు బొగ్గుల మహేంద్ర బాబు సార్ మీరు ఎందుకు అలా ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు అని ప్రశ్నించగా నువ్వు ఎవడివిరా నన్ను అడగడానికి అని అడగగా సార్ నేను ఓర్వకల్లు మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులు నా పేరు బొగ్గుల మహేంద్ర బాబు మాదిగ సార్ అని చెప్పాను ఎమ్మార్పీఎస్ అయితే ఏమి ఎవడైతే నాకేమీ నీకేం పని పాట ఉండదా ఫస్ట్ నువ్వు బయటికి పో రా అని అవమానించి ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోపో అని దురుసుగా ప్రవర్తించి కుర్చీలో నుండి లేచి వేలు చూపించి మీదికి రావడం జరిగింది ఒక దళిత నాయకుడికే ఇలాంటి పరిస్థితి ఏర్పడితే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి నన్నూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి మొదటి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ని వెంటనే తమ విధుల్లో నుంచి తొలగించి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఓర్వకల్లు మండల ఎస్సైకి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేయడమైనది.అలాగే ఓర్వకల్లు మండల ఎంపీడీవో ని డిజిటల్ అసిస్టెంట్ రియాజ్ భాష పై తగిన చర్యలు చేపట్టాలని కోరడమైనది.

# సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు నేడు అట్టర్ ప్లాప్

**రెండేళ్లు గడిచిన హామీలు ఎక్కడ అమలు అయ్యాయి -వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు-పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**

**కల్లూరు ప్రతినిధి, జూన్ 3 (రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున, వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి వారి కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు, పేరుతో రూపొందించిన పోస్టర్, బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు నేడు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేట ముంచారని అన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా ఆ హామీ ఎక్కడ అమలైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రతి ఆడబిడ్డకు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన ఆడబిడ్డ నిధి ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, మహిళలను



ఓట్ల కోసం మాత్రమే ఉపయోగించుకుని ఇప్పుడు పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. అలాగే 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా బుట్టదాఖలు చేశారని విమర్శించారు.రైతులకు మద్దతు ధరలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగులకు హామీలు, యువతకు ఉపాధి అవకాశాలు అంటూ ఎన్నో వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో హామీని ఒక్కొక్కటిగా మరిచిపోయిందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేని ప్రభుత్వం నైతికంగా అధికారంలో కొనసాగే హక్కును కోల్పోయిందన్నారు.డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో నెలకొన్న అనుమానాలు, అభ్యర్థుల సందేహాలను వెంటనే నివృత్తి చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక ,కల్లూరు అర్బన్ మాజీ కార్పొరేటర్లు,కల్లూరు మండల నాయకులు, అనుబంధ విభాగంలో వివిధ హోదాల్లో ఉన్నవారు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# దళితులకు ఇంటి పట్టాలు వ్యవసాయ భూములు ఇవ్వాలి,

**రైల్వేకోడూరు జూన్ 3 రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ లక్ష్మీ నగర్ హరిజనవాడ గ్రామస్తులకుఇంటి పట్టాలు. వ్యవసాయ భూములు ఇవ్వాలని రైల్వేకోడూరు మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట డి హెచ్ పి ఎస్ రైల్వేకోడూరు మండల కార్యదర్శి గంగాపూర్ తేజ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలియజేయడం జరిగినది, నిరసన అనంతరం మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు, ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య. సిపిఐ పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు చింతలపూరి నాగమ్మ. డి హెచ్ పి ఎస్ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి కటారి గోపాల్ హాజరు కావడం జరిగినది ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ సదురు మండలంలో అనంతరాజుపేట గ్రామపంచాయతీ రెవెన్యూ సర్వేనెంబర్ 12 33 లో 5 ఎకరాలు 89 సెంట్లు 12 32 లో 38 సెంట్లు మొత్తం ఆరు ఎకరాల 29 సెంట్లు ప్రభుత్వ బంజర భూమని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు విచ్చలవిడిగా ప్రభుత్వ భూములో నుండి పెద్దపెద్ద రోడ్లు వేసి పక్కన బిల్డింగులు కట్టడం కట్టా పుట్టాలమ్మ దేవాలయం కానుండి బొమ్మ వారం చెరువులోకి పెద్ద కాలవ





వర్షపు నీళ్ళు పోయేకి ఉన్న కాలువను పూర్తిగా పూడ్చి కొద్దిగా అక్కడ తూము పెట్టడంతో బొమ్మ వారం చెరువు కింద భూములు ఉన్నటువంటి రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు
రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు ప్రభుత్వ బంజర భూమిని విచ్చలవిడిగా వాడుకుంటున్నా కూడా రెవెన్యూ యంత్రాంగం దున్నపోతు మీద వర్షం పడినట్లు వ్యవహరిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు దగ్గర ముడుపులు తీసుకుని ప్రభుత్వ భూములను ఎక్కడ దోచుకుంటున్నా కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నాడని ఆయన మండి పడ్డారు ఇప్పటికైనా రెవెన్యూ తాసిల్దార్ కండ్లు తెలుసుకొని పేదవారి కోసం సదరు భూమిని పక్కనే ఉన్నటువంటి అనంతరాజుపేట పంచాయతీ గ్రామపంచాయతీ లో లక్ష్మీ నగర్ దళిత గ్రామ ప్రజలకు సదర భూమిలో పట్టాలకు మంజూరు చేసి మిగిలిన భూమిని గ్రామ అవసరాలకు కేటాయించి ప్రభుత్వ భూమిని కబ్జా చేసినటువంటి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.
అదేవిధంగా లక్ష్మీ నగర్ దళిత వాడవాసులకు బంజర భూమి కుటుంబానికి రెండు ఎకరాల ప్రకారం జరగబోయే ఎనిమిదవ విడత భూ పంపిణీ కార్యక్రమంలో పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. అలా లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గ సమితి డి హెచ్ పి ఎస్ నియోజవర్గ సమితి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను కలుపుకొని రైల్వే కోడూరు మండల తాసిల్దార్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం తెలియజేసి తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మండల్ రెవెన్యూ అధికారులకు హెచ్చరిక చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు డి హెచ్ పి ఎస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

# పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే వెన్నుముక

**మండల కన్వీనర్ కొండా పురుషోత్తం**

**చిప్పగిరి, జూన్ ,3 ,(రిపబ్లిక్ న్యూస్)**
పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే వెన్నెముక అని మండల కన్వీనర్ కొండా పురుషోత్తం తెలిపారు, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, వైకుంఠం ప్రసాద్ సూచనల మేరకు మొదటి బుధవారం యూనిట్ ఇన్చార్జి, క్లస్టర్, ఇంచార్జి బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సమావేశం భాగంగా యూనిట్ ఇంచార్జి ల బూత్ ఇంచార్జ్ ల ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల సమావేశం ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సమావేశంలో భాగంగా గ్రామ అధ్యక్షులు ఇంటి దగ్గర మండలం యూనిట్ ఇంచార్జి ల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి చిప్పగిరి మండల కన్వీనర్ కొండా పురుషోత్తమ్ అధ్యక్షత





వహించారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాల అమలు, సభ్యత్వ నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, రానున్న పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల సమస్యలు, ప్రజా సమస్యల పై టిడిపి యాప్ లో కొత్తగా ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం లో పాల్గొని ఆ యాప్ లో ఇంటింటికి వెళ్లి అప్లోడ్ చేయవలసినది గా సమస్యలను పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, పార్టీ నిర్వహించే కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో కార్యకర్తలు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని, పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల,గ్రామ స్థాయినాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు, అభిమానులు మరియు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఓర్వకల్ మండలం క్లస్టర్-4, యూనిట్-17 సోమయాజుల పల్లెలో ఓటర్ లిస్ట్‌పై సమీక్ష సమావేశం

**టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు మరియు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డి ఆదేశాల మేరకు**



**ఓర్వకల్ ప్రతినిధి, జూన్ 3 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్ మండలంలోని క్లస్టర్ నంబర్-4, యూనిట్ నంబర్-17 పరిధిలో నిర్వహించిన హౌస్ మ్యాపింగ్ మరియు ఓటర్ లిస్ట్ పరిశీలన కార్యక్రమంపై క్లస్టర్ ఇంచార్జ్‌లు,



యూనిట్ ఇంచార్జ్‌లు, బూత్ ఇంచార్జ్‌లు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటి వివరాల సేకరణ, ఓటర్ జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ లిస్టులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల గుర్తింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై కూడా నాయకులు కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ గౌడ్,ఓర్వకల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దుగ్గుపాటి నాగిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్, నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గోవింద్ రెడ్డి,బూత్ ఇంచార్జ్‌లు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాయింట్ సర్వే పై అధికారులతో సమీక్షించిన సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 03 రిపబ్లిక్ న్యూస్** ఫారెస్టు రెవెన్యూ భూములకు సంబంధించిన జాయింట్ సర్వే పై మండల అధికారులతో మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి సమీక్షించారు బుధవారం స్థానిక మండల పరిపాలన భవనంలోని తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆమె జాయింట్ సర్వేపై కూలంకుశంగా చర్చించారు ప్రత్యక్షేత్రం బోయకొండ పరిసర ప్రాంతంలో గల పుంగనూరు చౌడేపల్లి నిమ్మనపల్లి అధికారులతో బఫర్ జోన్ గురించి ఒక్కొక్కరిగా సమీక్ష నిర్వహించారు ఫారెస్ట్ మైనింగ్ రెవెన్యూ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసుకొని శాశ్వత పరిష్కారం వైపు అడుగులు వేస్తున్నట్లు వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్బరాజు ఫారెస్ట్ రేంజ్ అధికారి థామస్ సెక్షన్ ఆఫీసర్ అనిల్ కుమార్ చౌడేపల్లి పుంగనూరు తహసిల్దార్లు పార్వతి రాము రెవిన్యూ ఫారెస్టు మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డిశ్వర్ రెడ్డిని సన్మానించిన వైసీపీ నాయకులు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**
ఎస్ ఐ ఆర్ బి ఎల్ ఓలా పర్యవేక్షకుడు రెడ్డిశ్వర్ రెడ్డిని పలువురు వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు రొంపిచర్ల జడ్పీటీసి అయినా రెడ్డిశ్వర్ రెడ్డి చౌడేపల్లి ఎస్ఐఆర్బిఎల్ఓ ల పర్యవేక్షకుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన తొలిసారి మండలానికి రావడంతో వైసిపి నాయకులు ఆయనకు ఘన సన్మానం పలికి దుశ్యాలవాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్ బాబు , రాష్ట్ర మహిళా విభాగ నాయకురాలు రుక్మిణమ్మ, మండల వైసిపి పార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి,మండల వైకాపా ఉపాధ్యక్షుడు జంగాలపల్లి రమణ, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ నడింపల్లి దామోదర్ రాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రవిచంద్ర రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగువారంతా ఒక్కటే

**ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా రాజకీయం చేయొచ్చు**

**పవన్ కళ్యాణ్‌పై విమర్శల నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్య**

**అమరావతి,జూన్ 3** రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని, అనవసర వివాదాలతో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడం సరికాదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణలో కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయం చేసే హక్కు ఉంటుందని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'గతంలో నేను తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ తాము జాతీయ పార్టీ అని ప్రకటించుకుంది కదా.. ఇప్పుడెందుకు అనవసరంగా మాట్లాడుతున్నారు. అమెరికాలో కూడా తెలుగువారు సెనేటర్లు అవుతున్నారు. ప్రజాసేవ చేసినవారినే ప్రజలు ఆదరిస్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు తెలంగాణలో మాట్లాడుతున్న మాటలు ఎంతమాత్రం కరెక్ట్ కాదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయి 12 ఏళ్లు అవుతోంది. ఇన్నాళ్ల తర్వాత ఇప్పుడెందుకు మళ్లీ ఇవన్నీ సృష్టిస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఎవరికీ మంచిది కాదు. తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ.. తెలుగువారిగా అంతా కలిసికట్టుగా ఉండాలి. రెండు రాష్ట్రాలనూ ప్రగతి పథంలో నడిపించుకోవడమే అందరి లక్ష్యం కావాలి' అని అన్నారు.

# మమతా బెనర్జీ కోటకు బీటలు !

**జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా




కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# రాజధానిపై జగన్ నిత్య అసంతృప్తి

**ఓసారి మూడు రాజధానుల ప్రకటన**

**ఇప్పుడేమో మావిగాన్ అంటూ కొత్త గానం**

**జగన్ వ్యాఖ్యలు పిల్లలకు కూడా విసుగెత్తేలా ఉన్నాయి**

**రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ**

**అమరావతి,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. మావిగాన్ వ్యాఖ్యలపై మంత్రి నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మావిగాన్ వ్యాఖ్యల పట్ల చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటున్నారన్నారు. ఒకారి మూడు రాజధానులు, ఇప్పుడేమో మావిగాన్ అంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. జగన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహ మార్గాలను, పెనుమాక రిజర్వాయర్‌ను పరిశీలించారు. రాజధాని రోడ్డుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలలో వాగుల ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్మాణం జరుగుతున్న వంతెనల క్రింది భాగంలో మట్టి పూడిక తీతలు త్వరగా



తొలగించాలని ఆదేశించారు.
తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచి వస్తుందని.. అమరావతి ఆదాయం అన్ని జిల్లాలకు పంచుతారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అంటే విజన్ ఉండాలని.. జగన్‌కు లేదంటూ వ్యాఖ్యానించారు. రైతులను ల్యాండ్ పూలింగ్‌కు రావాలని మరోసారి కోరుతున్నట్లు తెలిపారు. రైతుల దగ్గర బలవంతంగా తీసుకోకూడదనే ఇప్పటి వరకు ల్యాండ్ అక్విజేషన్‌కు వెళ్లలేదన్నారు. 2028 ఆగస్టు నాటికి రాజధాని దాదాపు సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. నేటికి నయా రాయపూర్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జగన్ డేటా తీసుకుని మాట్లాడాలని హితవుపలికారు. అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. వర్షాకాలం వచ్చేలోగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. గత వర్షాకాలం పశ్చిమ బైపాస్ కింద వాగులు పూడిపోవడంతో వాటర్ వెనక్కి తన్నిందని.. వెస్టర్న్ బైపాస్ దగ్గర 2 బ్రిడ్జి పనులు జరుగుతుండగా మరో 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతాయన్నారు. వెస్టర్న్ బైపాస్ వద్ద వెంట్స్‌ను పదిరోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారు. అమరావతి వాటర్ ఎ÷-లో కోసం నెదర్లాండ్స్ వాళ్లతో మాట్లాడి డిజైన్ చేశామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని వెల్లడించారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని.. తరువాత 69 బ్రిడ్జిలు పూర్తి అవుతాయని తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర తీసుకొని గ్రావిటీ కెనాల్‌లను ఏర్పాటు చేసినట్లు నారాయణ తెలిపారు. గత సంవత్సరం వెస్టర్న్ బైపాస్‌ను కడుతూ ప్రవాహం పూడ్చేశారని.. దీంతో అక్కడ పూడిక ఏర్పడిందన్నారు. ఈసారి అలాంటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. 494 ఎకరాలకు మాత్రమే ఇంకా ఎ÷-లాట్‌లు కేటాయించలేదని.. అక్కడ న్యాయపరమైన చిక్కులు, వారసత్వ ఇబ్బందులు ఉన్నాయన్నారు. లాటరీకి సిద్ధంగా 144 ఎకరాలు 74 మంది రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 35,057 ఎకరాలు తీసుకున్నామని.. ఇందులో రిటర్నబుల్ ఎ÷-లాట్‌లు ఇవాల్సింది 498 ఎకరాలు మాత్రమే అని మంత్రి నారాయణ వెల్లడించారు.

# ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం

**ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?**

**రాజకీయ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ తెలంగాణ టిడిపి నేతలు**

**హైదరాబాద్,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

ఎన్టీఆర్ పార్టీ ప ఎట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళు



.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60-70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

## మేలో భారీగా తిరుమల లడ్డూ విక్రయాలు

**మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు వెల్లడి**

**తిరుమల,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భారీగా భక్తులు తరలి ర ఆవడంతో ఆదాయంతో పాటు, లడ్డూ విక్రయాలు కూడా పెరిగాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

## ప్రిన్స్‌టన్ విద్యా సంస్థలకు సుప్రీం మొట్టికాయలు

**అమెరికా యూనివర్సిటీ పేరు వాడడంపై ఆంక్షలు**

**తక్షణం సంబంధం లేదంటూ ప్రకటన విడుదలకు ఆదేశం**

**న్యూఢిల్లీ,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్** అమెరికాలో ఉన్న ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ పేరు వాడుతుండటంపై తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ యూనివర్సిటీకి తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీని ఆదేశించింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికల్లో కనీసం పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ




యాజమాన్యాన్ని ఆదేశించింది .అమెరికా యూనివర్సిటీ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ 'ప్రిన్స్‌టన్' పేరుతో కాలేజీలను నడుపుతోంది. తమ ట్రేడ్‌మార్క్‌ను వినియోగిస్తున్న వాగ్దేవి సంస్థలపై అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ' కేసు పెట్టింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. కాలేజీ వెబ్‌సైట్లలో అందరికంటే పెద్ద అక్షరాలతో 'డిస్‌క్లెయిమర్ నోటీసు' స్పష్టంగా ప్రదర్శించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, ఇతర అన్ని పత్రాలు, ఫారాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది. నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్ల పక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

**అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు**

**హైదరాబాద్,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

:తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్




పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# మాజీ మంత్రి హరీష్ రావు పుట్టినరోజు సంబరాలు

## -ఆందోల్ మండలం జోగిపేట పట్టణంలో





**ఆందోల్ ప్రతినిధి జూన్ 3( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
మాజీ ఎమ్మెల్యే శ్రీ క్రాంతి కిరణ్ గారి ఆదేశం తో మాజీ ~వీజ చైర్మన్ డి బి నాగభూషణం మరి యు చాపల వెంకటేశం అధ్వర్యంలో జోగిపేట పట్టణం లో ప్రియతమ నాయకుడు జనహృదయ నేత మాజీ మంత్రి వర్యులు టి.హరీష్ రావు గారి జన్మదిన వేడుకలు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరడుగుల బుల్లెట్ ట్రబుల్ షూటర్ జనహృదయ నేత మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు గారికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించి మరింత ప్రజా సేవలో పాల్గొనాలి అని భగవంతుని ప్రార్థిస్తున్నాము శ్రీ రామునికి హనుమంతుడి వలే శ్రీ కెసిఆర్ గారికీ హరీష్ అన్న నమ్మిన బంటు అనీ కెసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకుడు హరిష్ రావు గారు ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి మరియు అందోల్ నియోజక వర్గం అభివృద్ధికి తోడ్పాటు చేసిన నాయకుడు హరిష్ రావు గారికి జోగిపేట పట్టణ ప్రజల తరపున నియోజకవర్గం ప్రజల తరపున హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాము ఈ జన్మదిన వేడుకలో దీ~ా పార్టీ నాయకులు బిర్ల శంకర్, మహేష్ యాదవ్, శంకర్ రావు, రఫిక్, పెండా గోపాల్, దాసరి దుర్గయ్య, మన్నే పరిపూర్ణం, మొగులయ్య, పల్లే వెంకట రమణ, పోచయ్య, నాసర్ ఖాన్, బరుడి వీరేశం, పట్లురి శ్రీనివాస్, బాజి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఆందోల్ బస్టాండ్ వద్ద ప్రమాదకరంగా చెరువు తుమ్




**ఆందోల్ జూన్ 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఆందోల్ జోగిపేట ప్రాంతంలో గల ఆందోల్ బస్ స్టాప్ దగ్గరలో ఉన్నటువంటి చెరువు యొక్క తూము వద్ద ఎలాంటి భద్రత లేకుండా ప్రయాణికుల ప్రయాణిస్తున్న సమయంలో అక్కడ ఉన్నటువంటి టర్నింగ్ ప్రాంతంలో ఎలాంటి సూచిక బోర్డులు కానీ తూము వద్ద ప్రమాదానికి గురి కాకుండా ఉంచడానికి ఎలాంటి నిర్మాణ కట్టడాలు లేకుండా నిత్యం జిల్లా అధికారులు సంగారెడ్డి నుంచి జోగిపేటకు జోగిపేట నుంచి నారాయణఖేడ్ ప్రాంతాలకు తిరుగుతా ఉంటారు ఏ ఒక్క అధికారికి కూడా ఈ ప్రమాదకరమైన స్థలం కనబడడం లేదా ఎందుకంటే అక్కడ ఉన్నటువంటి ఆ టర్నింగ్ స్థలంలో ఏమాత్రం చిన్న తప్పిదం జరిగిన చెరువులో పడాల్సిన పరిస్థితి అక్కడ కంటికి కనబడుతుంది ఎందుకు ఇలాంటి నిర్లక్ష్యం అధికారులు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు ప్రజల పానాలంటే అధికారులకు విలువ లేదా ఎవరికి ఏమైతే ఏముంది అనే ధోరణితో అధికారులు ఉన్నారా అనే ఆలోచనలు వినబడుతున్నాయి వాస్తవానికి ఆందోల్ నడిబొడ్డున ఉన్నటువంటి బస్టాండ్ ప్రాంతం ముందు అందరికీ కనిపించే విధంగా ఉన్నటువంటి ప్రమాదకరమైన ఘటన స్థలాన్ని అటు ప్రతిపక్ష నాయకులు గానీ ఇటు అధికార పక్ష నాయకులు గానీ వారి యొక్క కంటికి కనబడడం లేదా ఏదైనా చిన్న ప్రమాదం జరుగుతే దానికి పరిణామం బాధ్యత ఎవరు వైన్ ఛార్జ్ వస్తుందో ఒకసారి ఆలోచన చేసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉంది ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్నటువంటి తూము వద్ద గోడ నిర్మాణం లాంటిది ఏదైనా నిర్మించి ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటారని నిత్యం ప్రయాణం చేస్తున్న ప్రజలు విజ్ఞప్తి చేస్తా ఉన్నారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం ఉధృతం చేయడానికి కూడా సిద్ధమని వారు డిమాండ్ చేస్తున్నారు

# తమ్మడపల్లెలో 70 ఏళ్ల తర్వాత ఘనంగా పెద్దమ్మ దేవర

## - వేలాది సంఖ్యలో తరలివచ్చిన జనం - వైభవంగా పెద్దమ్మ తల్లి గ్రామోత్సవం

## - ట్రాఫిక్ నియంత్రణకు మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది కృషి





**మహానంది, జూన్ 3, (రిపబ్లిక్ న్యూస్):**
మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో పెద్దమ్మ దేవర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు బంధుమిత్రులను ఆహ్వానించడంతో తరలివచ్చిన జనంతో గ్రామం కిటకిటలాడింది. వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించగా దేవరకు వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. 70 ఏళ్ల తర్వాత దేవర మహోత్సవం జరగడంతో గ్రామస్తుల్లో ఆనందంగా నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దమ్మ తల్లిని భక్తులు దర్శించుకోగా సాయంత్రం గ్రామోత్సవం



నిర్వహించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు మహానంది ఎస్ఐ కృషి:**

70 సంవత్సరాల తర్వాత పెద్దమ్మతల్లి దేవర నిర్వహించడంతో వేలాది సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మధ్యాహ్నం విందు భోజనాల అనంతరం తిరుగు ప్రయాణంలో ఇళ్లకు వెళ్లే క్రమంలో అందరూ వాహనాల్లో ఒకేసారి బయలుదేరడంతో నంద్యాల నుంచి మహానంది వెళ్లే మార్గం వాహనాలతో నిండిపోయింది. మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది ప్రణాళికాబద్ధంగా కృషిచేసి వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చేయడంతో గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు గ్రామానికి చేరుకుని పెద్దమ్మ తల్లిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు

# పదవీ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక భరోసా

## రూ.4.96 లక్షల చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ జగదీష్



**అనంతపురం క్రైమ్, జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్):**
పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన హోంగార్డు రఫిక్ బాషాకు జిల్లాలోని హోంగార్డులు అండగా నిలిచారు. తోటి ఉద్యోగిపై బాధ్యతను చాటుతూ అందరూ కలిసి సేకరించిన రూ. 4,96,290 మొత్తాన్ని జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ చేతుల మీదుగా బుధవారం రఫిక్ బాషాకు అందజేశారు.జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ చెక్కును అందించి రఫిక్ బాషాను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డులు అందించే సేవలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలోనే కాకుండా, పదవీ విరమణ అనంతరం కూడా తోటి ఉద్యోగికి అండగా నిలిచి భారీ మొత్తంలో ఆర్థిక సాయం అందించడం హోంగార్డుల ఐక్యతకు నిదర్శనమన్నారు.రఫిక్ బాషా కుటుంబ భవిష్యత్తుకు ఈ నిధులు ఉపయోగపడాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సహోద్యోగుల పట్ల చూపిన సేవాభావం, మానవత్వం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించేందుకు ముందుకొచ్చిన హోంగార్డులందరికీ రఫిక్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఇన్‌ఛార్జి ఆర్ఎస్ఐ జాఫర్, హోంగార్డుల ప్రతినిధులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపునకు సీడ్ బాల్స్ తయారీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి..!

## FRO మురళీకృష్ణ



**మహానంది, జూన్ 03,( రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పర్యావరణాన్ని రక్షించుటకు, పచ్చదనాన్ని పెంచేందుకు, అధిక ఉష్ణోగ్రతను తగ్గించేందుకు, సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని మహానందిలో అటవీ శాఖ నంద్యాల రేంజ్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం మహానందిలోని పర్యావరణ పరిరక్షణ కేంద్రమైన ఎకోలో నిర్వహించిన సీడ్ బాల్స్ కార్యక్రమంలో బాల్స్ నంద్యాల రేంజ్




ఆఫీసర్ ఆధ్వర్యంలో తయారుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతను పట్టుకునేందుకు పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగిందని, కావున ప్రతి ఒక్కరూ సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నందు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహానంది డిఆర్ఓ హైమావతి, సెక్షన్ ఆఫీసర్లు రామకృష్ణ, తేజ, ఫారెస్ట్ బీట్ అధికారులు పరమేశ్వరి, బలరాముడు, ప్రొటెక్షన్ వాచర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# భూ కబ్జాలకు అడ్డాగా మారిన సింగూరు ప్రాజెక్ట్

## మంత్రి సహకారంతో ముందుకు సాగుతున్న పనులు -ఆపేది ఎవరు అని వేడుకుంటున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు







**ఆందోల్ ప్రతినిధి జూన్ 3 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
సంగారెడ్డి జిల్లా సింగూరు ముంపు ప్రాంతాల్లో మంత్రి దామోదర రాజనర్సింహా బామ్మర్ది అనిల్ రెడ్డి అక్రమ తవ్వకాలు,ఎఫ్ టి ఎల్ తొలగింపు మరియ అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ ఆదేశంతో కదిలిన యంత్రాంగం.
కాదిరాబాద్ , సాయిపేట్ గ్రామ శివార్లలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు
కట్టను తొవ్వేసి , చదును చేసిన కొరివికుంట , నల్లకుంట ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు
గుట్టపై కుప్పలుగా పోసిన మట్టిని పరిశీలించిన అధికారులు
ఎఫ్ టి ఎల్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం వేసిన బండరాళ్లను కూడా పరిశీలించిన అధికారులు.
గత నెల రోజులుగా మట్టికొడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సాయిపేట , కాదిరాబాద్ గ్రామస్థులు.
గత కొన్ని రోజులుగా ఫిర్యాదు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం
అధికారులతో కలిసి తన ఫార్మ్ హౌస్ నుంచి కబ్జా ప్రాంతానికి చేరుకున్న మంత్రి బామ్మర్ది అనిల్ రెడ్డి.
మీడియా ప్రతినిధులు రావడంతో వారికంటపడకుండా జారుకున్న అనిల్ రెడ్డి.
కబ్జా జరుతున్న విషయాన్ని ఇప్పుడే చెప్పలేమంటూ మీడియాకు మొహం చాటేసిన అధికారులు.
కబ్జా అని అప్పుడే చెప్పలేమని అధికారులు మీడియా కు చెప్పడంతో అయితే మాకు అనుమతినివ్వాలన్న స్థానిక రైతులు
అక్రమన ప్రాంతాన్ని పరిశీలించాక అనిల్ రెడ్డి ఫార్మ్ హౌస్ కు వెళ్లిన అధికారుల బృందం. అక్కడే లంచ్
కబ్జాకు పాల్పడుతిన్న వ్యక్తి వద్దకే అధికారులు వెళ్లడంపై స్థానికుల్లో అనుమానాలు.
పొలంలో లోకి మట్టి కొట్టుకోడానికి చిన్న చిన్న చెరువుల్లో జె సి బి పెడితే అనుమతి లేదంటూ సీజ్ చేసే రెవెన్యూ , పోలీస్ అధికారులు అక్కడ కనిపిస్తున్న జె సి బి, ట్రక్కు , డంపర్ లను సీజ్ చేయలేరా... అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు.
ఎఫ్ ఆర్ ఎల్ లెవెల్ లను గుర్తించదానికి గాను బండరాళ్లపై కబ్జాదారులే గుర్తులు పెట్టినట్టు గ్రహించిన అధికారులు.
జెండా రాడ్ లకు ఉన్న రంగుతో రాసి అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయినట్టు ఆనవాళ్లు.

# నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్.

## ..0-6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులలో ఆరోగ్య, అభివృద్ధి లోపాల గుర్తింపు.

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**కర్నూలు, జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్ చేయడం జరుగుతుందని తద్వారా చిన్నారులలో ఆరోగ్య, అభివృద్ధి లోపాలను గుర్తించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.

బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం నవచేతన యాప్ ద్వారా ఏఐ-ఆధారిత ఈ సి డి స్క్రీనింగ్‌పై సిడిపిఓ, అంగన్వాడీ సూపర్వైజర్ లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారుల్లో అభివృద్ధి సంబంధిత సమస్యలు, వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "నవచేతన" యాప్‌ను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 5 నుండి 10 వరకు మండల స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం జిల్లా వ్యాప్తంగా నవచేతన యాప్ ద్వారా ఏఐ ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం నవచేతన యాప్ ఒక సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో చిన్నారుల అభివృద్ధి లోపాలను గుర్తించేందుకు చేపడుతున్న స్క్రీనింగ్ ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు యాప్‌లోని అన్ని అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని, తమ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వాలన్నారు. పిల్లల అభివృద్ధి స్క్రీనింగ్ కార్యక్రమం అత్యంత కీలకమైందని, ఇందులో సేకరించే సమాచారం భవిష్యత్తులో చిన్నారుల ఆరోగ్య, అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వివరాన్ని నిజాయితీగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పనిచేయాలని సూచించారు.

06 సంవత్సరాల పిల్లల్లో బర్త్ డిఫెక్ట్స్, వ్యాధులు, పోషకాహార లోపాలు, అభివృద్ధి ఆలస్యాలు (4 డి.ఎస్) సులభంగా గుర్తించేందుకు అంగన్‌వాడీ సిబ్బందికి "అవును/కాదు" విధానంలో సరళమైన చెక్‌లిస్ట్ రూపొందించాలని కలెక్టర్ వైద్య నిపుణులను






సూచించారు. గ్రాస్ మోటార్, ఫైన్ మోటార్, భాషా, జ్ఞానాత్మక (కాగ్నిటివ్), సామాజిక-భావోద్వేగ (సోషియో-ఎమోషనల్) అభివృద్ధి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పిల్లల వయస్సుకు తగిన నైపుణ్యాలను అంచనా వేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అభివృద్ధి లోపాలను తొలిదశలోనే గుర్తించడం ద్వారా తగిన వైద్య, పునరావాస సేవలు అందించవచ్చని, వినికిడి లోపాలు వంటి సమస్యలను కూడా ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. పిల్లల్లో ఆటిజం కేసులు పెరుగుతున్న నేపథ్యంలో లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. ఆటిజంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పిల్లల అభివృద్ధి సూచికలను క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా అభివృద్ధి లోపాలను ముందుగానే గుర్తించి తగిన సేవలు అందించవచ్చన్నారు.

పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార కిట్లు, గుడ్లు, పాలు వంటి ఆహారాన్ని పిల్లలకు సక్రమంగా అందించి పోషకాహార లోపాలను తగ్గించాలని కలెక్టర్ సూచించారు. అలాగే మేనరిక వివాహాల వల్ల జన్యుపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయని, వాటి దుష్పరిణామాలపై గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు.. పిల్లల అభివృద్ధి లోపాల గుర్తింపుతో పాటు పోషకాహారం, తల్లి-శిశు ఆరోగ్యం, మేనరిక వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా మరియు ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో చైతన్యం పెంచేందుకు మరింత చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో ఐసిడిఎస్ పిడి విజయ , డా. సృజన రెడ్డి, జిల్లా ప్రారంభ జోక్య కేంద్రం (ఐజు×జ) మేనేజర్ ఇర్ఫాన్, మెడికల్ ఆఫీసర్లు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సేవలు అందించాలి

### : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, జూన్ 03 (రిపబ్లిక్ న్యూస్):**

ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ ప్రజల అభిప్రాయాలు (పర్సెప్షన్), రీ-సర్వే ప్రక్రియ పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు వివరాలతో పాటు సంబంధిత శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవలను సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు

## ఐటీసీ సిగరెట్ గోదాం చోరీ కేసు ఛేదన. అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్..

**రూ.14 లక్షల నగదు, కారు స్వాధీన -డోన్ టౌన్, సీసీఎస్ పోలీసుల సంయుక్త ఆపరేషన్.**

**నంద్యాల,జూన్ 03 రిపబ్లిక్ న్యూస్**

నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని ఐటీసీ సిగరెట్ గోదాంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.14,01,500 నగదు, చోరీకి వినియోగించిన మారుతి సుజుకి స్విఫ్ట్ కారు, 45 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ సునీల్ శోరాన్ వెల్లడించారు.

పోలీసుల కథనం మేరకు, ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీ వేకువజామున డోన్ పట్టణంలోని ఐటీసీ సిగరెట్ గోదాంలో చోరీ జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన డోన్ టౌన్ పోలీసులు, సీసీఎస్ నంద్యాల పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు, డోన్ డీఎస్పీ పర్యవేక్షణలో చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా బుధవారం ఉదయం డోన్-గుత్తి రహదారిలోని రుద్రాక్ష గుట్ట సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో వారు రాజస్థాన్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులని, తమ మరో సహచరుడితో కలిసి ఐటీసీ గోదాంలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన సిగరెట్ కార్టన్లను హైదరాబాద్‌లో విక్రయించి వచ్చిన నగదును తమ వద్ద ఉంచుకున్నట్లు వెల్లడించారు. అలాగే కడపలో కూడా ఇదే తరహా పలు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం.

**అరెస్టైన నిందితులు**

లక్ష్మణ్ రామ్ కుమావత్ (45), పాలీ జిల్లా, రాజస్థాన్




గన్ శ్యాం అలియాస్ గన్ పత్ (45), పాలీ జిల్లా, రాజస్థాన్

మానక్ చంద్ కుమావత్ (35), పాలీ జిల్లా, రాజస్థాన్

పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముగ్గురు నిందితులపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక చోరీ కేసులు నమోదై ఉన్నాయి.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

రూ.14,01,500 నగదు

మారుతి సుజుకి స్విఫ్ట్ కారు (DL1CQ9769)

45 లీటర్ల నాటు సారాయి.

ఈ కేసు ఛేదనలో విశేష కృషి చేసిన డోన్ టౌన్ పోలీస్ స్టేషన్, సీసీఎస్ నంద్యాల పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు. దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన ఇన్‌స్పెక్టర్లు జి. ఇంతియాజ్ బాషా, పి. సురేష్ కుమార్‌తో పాటు ప్రత్యేక బృంద సభ్యులను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

## ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ హిత జీవన విధానాలను అలవర్చుకోవాలి

**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు**

**పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి**




**నంద్యాల బ్యూరో, జూన్ 03 (రిపబ్లిక్ న్యూస్):**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ గోడపత్రికను ఆవిష్కరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు, పర్యావరణ హిత జీవన విధానాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే, "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొననున్న నేపథ్యంలో, వారందరికీ జూట్ బ్యాగులు మరియు మొక్కలను పంపిణీ చేసేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రజలను మరింతగా భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, కాలుష్య సమస్యలు మరియు సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి మరియు అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జూన్ 20వ తేదీలోపు జిల్లాలో 8 లక్షల విత్తన



బంతులు తయారు చేసి సిద్ధంగా ఉంచేలా సోషల్ ఫారెస్ట్రీ డివిజనల్ ఫారెస్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు మరియు ఖాళీ భూముల్లో విస్తృతంగా చల్లడం ద్వారా హరిత విస్తీర్ణాన్ని పెంచే చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

## ఇంధన ధరల పెంపుపై న్యూడెమోక్రసీ నిరసన

**ఆటోను తోసుకుంటూ వినూత్న ఆందోళన -పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్**






**అనంతపురం క్లాక్ టవర్, జూన్ 03,(రిపబ్లిక్ న్యూస్):**

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా బుధవారం అనంతపురం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఆందోళనలో భాగంగా డీజిల్ ధరల పెరుగుదలతో ఆటోలను నడపడం కష్టంగా మారిందని నిరసనకారులు ఆటోను తోసుకుంటూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం రవాణా రంగంపై తీవ్రంగా పడుతోందని, ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**పేదలు, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు**

ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి సి. నాగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అధికంగానే కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్రపంచ పరిస్థితులను సాకుగా చూపుతూ ప్రజలపై అదనపు భారం మోపడం సమంజసం కాదన్నారు.ఇంధన ధరల పెరుగుదలతో రవాణా చార్జీలు పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోందన్నారు. రైతులు, కార్మికులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ఎరువుల ధరలు పెరగడం, వ్యవసాయ ఖర్చులు అధికం కావడం వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని నాయకులు పేర్కొన్నారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందని స్థాయికి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు ఇస్తూనే ప్రజలపై ధరల భారం మోపడం సరికాదన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విరమించి రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి**

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, ఎరువులు, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రభుత్వాలను కోరారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి ఫక్రుద్దీన్, అధ్యక్షుడు వీరనారప్ప, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి. కిష్ట, ఐఎఫ్టియు నాయకులు ఎర్రిస్వామి, ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి రాయుడు,ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సి. ప్రకాష్, ఐఎఫ్‌టీయూ నాయకులు, పీఓడబ్ల్యూ, దళిత విముక్తి పోరాట సంఘం, అరుణోదయ, పీడీఎస్‌యూ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com